# నీలాప నిందలు

— శరచ్చంద్ర

వినాయక చవితి మర్రోజు- ఆఫీసుకెళ్ళిన నన్ను, జనాలంతా వింతగా, భయంభయంగా, ఏదో భూత వైద్యుడ్నో, మాయల ఫకీర్నో చూసినట్టు చూడడం మొదలు పెట్టారు.

ఎప్పుడూ కులాసాగా జోకులేస్తూ, కబుర్లు చెప్తూండే, నా ఎదురు సీటు పరాంకుశం, ఫైల్లో తల దూర్చి తెగ స్టడీ చేయడం మొదలెట్టాడు.

'ఏమిట్రా సాంబు? అట్లా చూస్తున్నావు' అంటూ నా ప్రక్క సీటు మిత్రుడి భుజాన చెయ్యేయ్యబోతే, వాడు ప్రక్కలో బాంబు పడ్డట్టు ఎగిరిపడి, దూరంగా పారిపోయాడు. అట్లాగే, నారాయణని పలకరించబోతే, వాడేదో పేద్ద పనున్నట్లు వడివడిగా వెళ్ళిపోయాడు.

పని, పాట లేకుండా తిరిగే, ఉచిత సలహాలావు నా దగ్గరకొచ్చి, "మనిషన్నాక కొంచెమన్నా బుద్ధుండాలి- ఏదో శక్తి వుంది గదాని, సాటి మనుషుల మెదడుల్ని గులాబ్ జామ్‌లలాగా చప్పరించేసి, ప్రాణాల్ని పంచదార పాకంలాగా తాగేస్తే, 'ఆనాటి ఆటవిక మానవులకీ, నేటి నాగరికులకూఇంక తేడా ఏమిటి?' అంటూ వెధవ సోదంతా నా చెవిలో చెప్పి ఊదరకొట్టేశాడు-

'ఏమిటయ్యా? నేను చేసిన మహాపరాధము?' అంటూ నిల్దీసేసరికి 'చేసిన్వాడివి చేయాల్సిందంతా చేసి, ఇంకా ఎందుకోయ్ ఈ బోడి నాటకం అంటూ వెళ్ళిపోయాడు.

'ఏమి చేశాను చెప్మా?' అంటూ ఆలోచనలో పడ్డాను- 'చవితి'నాడు సెలవు కాబట్టి, సరదాగా, మా ఆవిడకి వంటలో సహాయం చేశాను. పిల్లల్ని తీసుకొని సినిమాకెళ్ళాము- ఇందులో ఏదో తిరకాసుంది- అనుకొంటూ, ఆఫీసర్ గదిలోకెళ్ళాను,

ఏదో ఫైలు మీద సంతకం కోసం.

నన్ను చూడడంతోనే ఆయన కుర్చీని గోడవైపు త్రిప్పుకొని, చెవుల్లో వ్రేళ్లు అడ్డం పెట్టుకొని, "చూద్నాయన! నీకు ఒకటే, కాదంటే... రెండింక్రిమెంట్లిప్పిస్తా... దయచేసి నా జోలికి రావద్దు' అంటూ వణకుతున్న కంఠంతో మాట్లాడడంతో, ఇట్లాగైతే ఇంక లాభం చేదనుకుని, మా సాంబుగాడ్ని పట్టుకున్నాను.

వాడు భయపడ్తూనే "నన్నొదిలెయ్యరా... మా అమ్మకు, నాన్నకు నేనొక్కణ్ణే కొడుకుని' అంటూ జరిగిన విషయమంతా వివరించాడు.

అది విన్న నాకు మతిపోయినంత పనయింది.


'అబద్ధం' అంటూ గట్టిగా అరిచాను.

'ఇదేదో క్రొత్త ప్రక్రియలాగా వుంది- గప్‌చిప్ సాంబార్ బుడ్డి' అన్నాడు ఉచిత సలహాలావు.

అంతే- అప్పటిదాకా కబుర్లాడుకుంటున్న జనాలంతా ప్రాణ భయంతో తలా ఓ దిక్కుకు పారిపోయారు.

'అది నేను కాదయ్యా బాబూ... వేరెవరో సుబ్బారావు అయ్యుంటాడు' అంటూ ఎంతగా నెత్తి నోరు కొట్టుకుని చెప్పినా వినిపించుకోలేదు, ఎవ్వరూనూ-

వెంటనే, సాంబుని, వు.స.రావుని, మరో ఇద్దరు పెద్దల్ని తీసుకొని, హాస్పిటల్‌లో కోలుకుంటూన్న వాళ్ళ దగ్గరికి తీసుకెళ్ళాను- వాళ్ళు అంతా ముక్త కంఠంతో, చవితి సందర్భంగా ఘోర (దూర) దర్శన్ వాళ్లేర్పాటుచేసిన కవి సమ్మేళనంలో, కవితలు



చదివిన సుబ్బారావుని నేను కాదని చెప్పడంతో, సమస్య ప్రశాంతంగా అయింది.

ఏదో అప్పుడప్పుడు చిట్టి చిట్టి కవితలు రాస్తుండడమే ప్రాణాంతకమైందని గుర్తించి, ఇంక జీవితంలో కవితల జోలికెళ్ళ కూడదని తీర్మానించుకున్నాను.

నాకు అప్పుడు గుర్తొచ్చింది-

'చవితినాడు, పూజ చేసుకోకుండా చంద్రుడ్ని చూడకూడదండి- నీలాప నిందలు చుట్టుకుంటాయి' అన్న మా ఆవిడ మాటల్ని ఖాతరుచేయకుండా చంద్రుడ్ని చూసినట్లు-

హారి దేముడా! మరీ ఇంత ఘోరమైన అపవాదా?!

